# రోజులు మారలా!
# బుద్ధులే గడ్డి తింటున్నయ్!

(ఈ మధ్య జరిగిన కౌన్సిల్ ఎలక్షన్‌లో గ్రాడ్యుయేట్స్ చాలామంది డబ్బు తీసుకుని ఓట్లేశారన్న విషయం తెలిశాక)



ఒకప్పుడు రాజకీయాలు చాలా గౌరవప్రదంగా ఉండేవి. ప్రతి ఊళ్ళో ఒకో పార్టీకి ఒకరో లేక ఇద్దరో నాయకులు ఉండేవారు. వాళ్ళ మాటను పార్టీ వర్కర్స్ వేదవాక్కుగా భావించేవారు. బాగా చదువుకున్నోళ్ళూ నీతీ నిజాయితీలకు పేరున్నవాళ్ళూ, ముందు నా దేశం– తర్వాతే నా ఊరు అనుకునేవాళ్ళూ– కర్రప్షన్ మాట వినబడితే చాలు కర్ర పట్టుకుని వెంటపడే వాళ్ళు. అలాంటి వాళ్ళకే పార్టీ టిక్కెట్లు ఇచ్చేవాళ్ళు. అధికార పార్టీతో సమానంగా ప్రతిపక్ష నాయకులూ చాలా హుందాగా, నీతీ నిజాయితీలతో ఉండేవారు. ఒకరినొకరు గౌరవించుకునేవారు. చౌకబారు ఆరోపణలు అసలు ఉండేవి కావు. దొంగలు దోపిడీ గ్యాంగ్‌లు, మర్డరర్లు, కులాల పిచ్చోళ్ళూ– వీళ్ళందర్నీ అన్ని పార్టీలూ ఆమడ దూరంలో ఉంచేవి. మరి ఇప్పుడో–

మొత్తం రివర్స్!

"అవతల పార్టీవాడు ఓల్డ్ సిటీలో ఎవర్ని నిలబెడుతున్నాడు?"

"వాడే–చాంద్‌పాషా అని నొటోరియస్ రౌడీ షీటరున్నాడు కదా! వాడికిచ్చారు టిక్కెట్టు"

"మరి మనం ఎవర్ని నిలబెట్టాలి?"

"ఇర్ఫాన్ అనేవాడి మీద ఈ మధ్యే ఎనిమిది మర్డర్ కేసుల్లోనూ, తొమ్మిది రాబరీల్లోనూ, 14 బ్లాక్‌మెయిలింగ్ కేసుల్లోనూ పోలీస్ స్టేషన్స్‌లో కేసులు రిజిస్టర్ అయ్యాయ్– ప్రస్తుతం వాడే సిటీలో చాలా ఫేమస్ అయ్యాడు– వాడికి టెర్రరిస్ట్ లింక్స్ కూడా ఉన్నాయంటున్నారు. ఈ మర్డర్స్, లూటింగ్స్, లాండ్ గ్రాబింగ్స్‌లతో దగ్గర దగ్గర వందకోట్లు సంపాదించాడంటున్నారు. మనం వాడిని నిలబెడితే బెస్ట్. ఈజీగా గెలుస్తాడు"

"చాంద్‌పాషా మీద ఎలా గెలుస్తాడు? వాడూ ఇదే టైప్ కదా?"

"కానీ వీడికి ఎక్కువ బుకింగ్స్ ఉన్నాయ్. మర్డర్స్, కిడ్నాప్స్‌కు 2014లోని ఎలక్షన్స్ వరకూ అడ్వాన్స్‌గా బుక్కయిపోయాడు"

"అయితే ఇంక ఆలస్యం ఎందుకు వాడిని కాంటాక్ట్ చేయకపోయారా?"

"చేశాం సార్. కానీ వాడు ఒక కండిషన్ పెడుతున్నాడు– మన పార్టీ తరపున పోటీ చేయడానికి!"

"ఏమంటున్నాడు?"

"మన ఆర్టీ పవర్‌లోకొస్తే– వాడికి హోమ్ మినిష్టర్ పోస్ట్ ఇవ్వాలంట"

"ఏంటి? వాడికి మన స్టేట్ హోమ్ మినిస్టర్ పోస్ట్ ఇవ్వాలా? వాడికేం పిచ్చెక్కిందా?"

"తప్పేముంది సార్. ఇంతకుముందు హోమ్ మినిష్టర్లు వాడి కంటె తక్కువేముందని?"

"నేననేదదేనోయ్. ఇంత పవర్‌ఫుల్ కాండిడేట్ కేంద్రంలో హోమ్ మినిస్టరవ్వాలి!

ఈ చెత్త రాష్ట్రంలో అంత టాలెంట్ వృథా అయిపోతుంది కదా!"

"కానీ కేంద్రంలో హోమ్ మినిష్టరంటే వాడొప్పుకోవటం లేద్సార్"

"ఎందుకని?"

"వాడి గ్యాంగ్‌లో సగం మంది మన స్టేట్‌లోనే జైల్లో చాలా కేసుల్లో ఇరుక్కునున్నారు. వాళ్ళందరినీ విడుదల చేయాలంటే రాష్ట్ర హోంమంత్రి అయితేనే కుదురుతుందంటున్నాడు"

"పిచ్చాడి లాగున్నాడే- కేంద్ర హోమంత్రిగా ఉంటే- ఉరిపడ్డ వాడి గాంగ్ మెంబర్లు అందరినీ విడిపించుకోవచ్చు కదయ్యా?"

"పాయింట్ ఓకేగానీ- వాడింకో ప్రాబ్లెమ్ చెప్తున్నాడు సార్-"

"ఏంటిది?"

"సెంటర్‌లో ఒక పార్టీ- స్టేట్‌లో ఇంకో పార్టీ వస్తే కేంద్ర హోంమంత్రిగా వాడికేం ఉపయోగం ఉండదు కదా?"

"అవునవును, సరే- చేసేదేముంది? డెమోక్రసీకి వాడొక్కడే కరెక్ట్ కాండిడేట్ లాగా కనబడుతున్నాడు. వెంటనే వాడికి బి.ఫారం ఇచ్చి నామినేషన్ వేయించెయ్"

ఇది ఇవాళ పొలిటికల్ సెటప్! యథా రాజా తథా ప్రజా అనేది నూటికి నూరు పాళ్ళూ నిజం కదా!

అందుకే మా నియోజకవర్గంలో ఎవరెవరు నిలబడ్డారో వారందరికీ ఇంటర్వ్యూలు కండక్ట్ చేసి, మా టెస్ట్‌లో పాసయిన వాడికే మా నిర్భయ్‌నగర్ కాలనీలో ఉన్న రెండువేల ఓట్లూ వేయాలని నిర్ణయించుకున్నాం.

మొదటిరోజు ఒక ఫేమస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న గూండారెడ్డి మా కాలనీ కొచ్చాడు. గూండారెడ్డి అదివరకే రెండు మూడుసార్లు ఎమ్మెల్యేగా చేశాడు. కాలనీ వాళ్ళందరం స్వాగతం పలికాం. పార్వతీదేవీ, సావిత్రమ్మా ఇంకొంతమంది లేడీస్ కలిసి అతనికి హారతి ఇచ్చి వేదిక మీదకు ఆహ్వానించారు.

మా కాలనీ మైనార్టీ కాండేట్ నిసార్ అతనికి స్వాగతం పలికాడు.

"గూండాధ్యక్షా! అవినీతాగ్రేసరా! మా నిర్భయ్‌నగర్ కాలనీకి మేమంతా మీకు స్వాగతం చెప్తున్నయ్! మీట్ యువర్ ఓటర్ కార్యక్రమం లోపట మీరూ మా కాలనీకి ఇన్‌వైట్ చేస్తే వచ్చినయ్. అందుకు మా మెంబర్స్ అన్నీ హాపీగున్నయ్. ఇప్పుడు మా కాలనీ లేడీస్ వింగ్ ప్రెసిడెంట్ అనూష మీకు దండవేస్తయ్" అనగానే అందరూ తప్పట్లు కొట్టారు.

వెంటనే అనూష వేదిక మీదకెళ్ళి అతని మెడలో దండవేసింది.

అనూషను చూసి గూండారెడ్డి కన్నుగీటాడు.

ఆమె ఉలిక్కిపడింది.

"వాడు నన్ను చూసి చిల్లరగా బిహేవ్ చేస్తున్నాడు" అంది కోపంగా రంగారెడ్డితో.

"వాడు మనక్కాబోయే ఎమ్మెల్యే! వాడితో గొడవ పెట్టుకోవటమెందుకు? సైలెంట్‌గా ఊర్కో" అన్నాడు జనార్ధన్.

ఆ తరువాత ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలయింది.

"గూండారెడ్డి సాబ్– మీ మీద ఎన్ని పోలీస్ కేస్‌లున్నయ్?" అడిగాడు శాయీరామ్.

"మన స్టేట్‌లో రెండొందలు కేస్‌లు పెండింగ్‌లో ఉన్నయ్– పక్క స్టేట్‌లో నూట పద్నాలుగు. ఇంకో పదహారు కేసులు బుక్కయితే గిన్నిస్ రికార్డ్ బ్రేక్‌జేస్తా–"

అందరూ తప్పట్లు కొట్టారు.

"నేన్చెప్పలే! చాలా గ్రేట్ ఫెలో వీడు!" అంటోంది పార్వతీదేవి.

"మీరెంత కాలం జైల్లో ఉన్నారు?" అడిగాడు రంగారెడ్డి.

"ఇగో! బచ్‌పన్‌కెళ్ళి మన జిందగీ అంతా జైల్లోనే గుజరాయించినారా భయ్! ఒకదినం మా జైలర్‌సాబ్ నాతాన కొచ్చి– నన్ను చానా లైక్ చేస్తాడన్నట్లు– 'ఏంరా గూండారెడ్డీ! మన జైల్లో ఉన్న ఖైదీలందరూ ఎప్పుడు చాన్స్ దొరికితే అప్పుడు పెరోల్ మీద బంధువుల్ని పెళ్ళాం బిడ్డల్ని కలుసుకుని గడపనీకి రెండు మూడు రోజులు ఇండ్లకు పోతారు కదా? మరి నువ్ ఒక్కదినం కూడా మీ వాళ్ళ దగ్గరకు పోవేంరా? అనడిగిండు.

నేనేం జెప్పినానో ఎరుకనా? "జైలర్ సాబ్! నా బంధువులు, నా కుటుంబం, నా దోస్తులు– అందరూ ఈ జైల్లోనే ఉండే– ఇంక బయటెవడున్నాడని బయటకు పోవాలె?"

అందరూ ఈలలు వేసి తప్పట్లు కొట్టారు.

"అటువంటి ఖాన్‌దాన్ మాది. మొత్తం ఖాన్‌దానంతా జైల్లోనే ఉంటూండెరా భయ్. నాకు ఇంకొక్క గిన్నిస్ రికార్డ్ కూడా ఉన్నదిరా భయ్. జైల్లో ఉండే బయట ఎనిమిది మర్డర్లు జేసినా! వరల్డ్‌లో గిట్ల జేసెడిది ఎవడితోటి కాలే!"

మళ్ళా మా కాలనీ లేడీస్, పిల్లలు, యూత్ తప్పట్లు కొట్టారు.

"నా మీద మర్డర్ కేస్‌లు, రేప్ కేస్‌లు, కిడ్నాప్ కేస్‌లు, లాండ్ గ్రాబింగ్ కేస్‌లూ, బ్లాక్ మెయిలింగ్ కేస్‌లూ– ఇన్నున్నాగానీ కాంగ్రెసోళ్ళూ– తెలుగుదేశమోళ్ళూ– బీజేపీ వోళ్ళు, కమ్యూనిస్టోళ్ళు జైలులో నా సెల్ ముందు లైన్ కట్టిన్రు.

అన్నా! నువ్వే వచ్చే ఎలక్షన్స్‌లో మా పార్టీ కాండేట్‌గా ఎన్నికల్లో పోటీ చేయాలని కాళ్ళమీద పడిన్రనుకో!"

మళ్ళీ మేమంతా హాపీగా తప్పట్లు కొట్టి ఈలలు వేశాం.

"నేను ఆళ్ళందరికీ ఒక్కటే జెప్పినా! ఇగో– నా మీదా, నా ఖాన్‌దాన్ మీదున్న కేస్‌లన్నీ మాఫ్ జేస్తానని ఎవడు నాకు రైటింగ్‌లో ఇస్తే ఆడి పార్టీల జేర్తా– అన్నా!

అరె నీయవ్వ- అందరూ రాసిచ్చిన్రురా భయ్! ఇంకేం జెయ్యాలో సమజ్ కాక లాటరీ ఏసినా! నేను జైల్లోపటే ఉంటినా? నా చెంచాలు ఇంటింటికీ తిరిగి చాకు చూబించి మంచిగ ప్రచారం జేసిన్రు! అరె నీయవ్వ- పబ్లిక్ ఆలాంటి దాదాలను ఎంత లైక్ చేస్తున్రో నాకప్పుడు సమజయింది! లక్షన్నర ఓట్ల మెజార్టీతో గెలిచినరా భయ్. అది గూడా ఎవళ్ళ మీద గెలిచినా? ఆడెవడో పెద్ద సదువులు సదవిన మేధావంట! ఆడి మీద ఒక్క పోలీస్ కేస్‌భీ లేదంట! వాని ఖాన్‌దానంతా ఫ్రీడమ్ ఫైటర్సంట! నువ్వేమయిన జెప్పు, ఆ పాగల్ గాడిని చూస్తే నాకు జాలేసిందిరా భయ్. గసంటోళ్ళు ఏడనో కొలువులు జేసుకు బ్రతకాలె. ఆళ్ళకు పాలిట్రిక్సెందుకు రా?"

మళ్ళా అందరూ తప్పట్లు కొట్టాం!

"సార్! ఈ ఎలక్షన్స్‌లో మిమ్మల్ని మళ్ళా గెలిపిస్తే మీరు మా కోసం ఏం జేస్తారు?"

"ఇగో- మీలో ఎవడు ఏ కేస్ మీద జైలుకి పోయినాగాని 24 గంటల్లో నేను జామీనిచ్చి ఇడిపిస్తా! ఇదివరకే క్రిమినల్ కేస్‌కింద బుక్కయినోళ్లందరినీ సిఆర్ఎస్‌స్కీమ్ కింద ఇంటికి పంపిస్తా"

"సిఆర్ఎస్ స్కీమ్ అంటే ఏంది సార్?" అడిగాడు శాయీరామ్.

"అరె నీయవ్వ! సిఆర్ఎస్ అంటే ఎరుకలేదా? అన్ని పార్టీవాళ్ళూ పవర్లోకొచ్చాక పైసలు దండుకోనికి పెడతార్రా భయ్- బిఆర్ఎస్ స్కీమ్ అని-అంటే బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్- అంటే ఏందన్నట్లు- ప్లాన్ శాంక్షన్ లేకుండా భూమి నీదికాక పోయినాగానీ, కబ్జా చేసి ఇల్లు కట్టినావనుకో- దానిని రెగ్యులరైజ్ జేయాలి కదా! గట్లనే క్రైమ్ చేసినోళ్ళందరూ గూడా క్రైమ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ కింద అప్లయ్ జేస్తే పైసల్దీసుకుని మొత్తం కేస్‌లన్నీ మాఫ్ జేస్తామన్నట్లు!"

అందరం మళ్ళీ తప్పట్లు కొట్టాం! మా కాలనీలోని గాళ్స్ కొంతమంది వేదిక మీదకు దూసుకెళ్ళి గూండారెడ్డి ఆటోగ్రాఫ్‌లు తీసుకుని ఫోటోలు దిగారు.

"ఇంకోముచ్చటేందంటే టెన్త్ క్లాస్‌కెల్లే కొత్త కంప్యూటర్ కోర్స్‌లు షురూ జేయిస్తా- ఆ కోర్స్‌లో ఏం ట్రెనింగ్ ఇస్తరంటే- ఏటిఏం కార్డ్ ఫ్రాడ్ ఎట్లా జెయాలె! క్రెడిట్ కార్డ్ ఎట్లా ఫ్రాడ్ జెయాలె! చేసినాక ఎట్లా పట్టుబడకుండా ఉండాలె! బాంక్ ఎకౌంట్స్‌లో వేరేవోళ్ళ ఎకౌంట్స్‌లోని డబ్బు మన ఎకౌంట్స్‌లోకి ఆన్‌లైన్‌లో ఎట్లా ట్రాన్స్‌ఫర్ జేసుకోవాలె! ఇవన్నీ నేర్పిస్తే ఇంక మన స్టేట్‌ల నిరుద్యోగం ఏడుందిరా భాయ్"

అందరూ 'జయహో' అని అరిచాం!

అక్కడితో ఆ రోజు కార్యక్రమం ముగిసింది.

గూండారెడ్డి వెళ్ళేటప్పుడు మా ప్రెసిడెంట్‌ని పక్కకు పిలిచాడు. "ఇగో గోపాల్రావ్

అన్నా! మీ కాలనీ లేడీస్ వింగ్ ప్రెసిడెంట్ పేరు అనూష కదా! దాన్ని నాతోటి సెటిలవమని జెప్పు! దాన్ని నాకు పర్మనెంట్‌గా సెటప్ జేసినావనుకో– మీ కాలనీకి రెండు కోట్లు డొనేషన్ ఇస్తా”

యాదగిరి షాకయ్యాడు.

“దేఖోసాబ్! ఇది ఫస్ట్‌టైమ్, ఎమ్మెల్యే కేండేట్ గిసంటి డిమాండ్ చేసెడిది! ఇది డిగ్నిఫైడ్ పీపుల్ ఉండే కాలనీ. గసంటి దందాలు ఎవ్వరూ చెయ్యరు”

గూండారెడ్డి పగలబడినవ్వాడు.

“ఏందిరో! నాకు లెసనిస్తున్నావ్! పైసల్దీసుకుని ఓటేయటం మన స్టేట్‌లో కాలనీలన్నింటికి ఆదత్ జేసిందెవళ్ళు? మా రాజకీయ నాయకులే కదా! మీ కాలనీలో వుండేటోళ్ళందరూ డిగ్నిఫైడ్ పీపులన్నావ్. మేము పైసల్దీసుకోకుండా ఓటేస్తాం అని ఎవళ్ళయినా అంటున్రా! పైసల్దగ్గర బుద్ధి గడ్డితినేప్పుడు లేని డిగ్నిటీ పడుకోనికి అడ్డమెందు కొస్తున్నదిరా భయ్”

మా అందరికీ అతని మాటలతో రక్తం ఉడికిపోయింది. అదే ఇంకొకళ్ళెవరయినా ఆ మాటంటే దుమ్ము లేపేవాళ్ళం.

కానీ వాడు మన ప్రజలందరి ప్రతినిధి! వాడికే మనం ఓట్లేసి గెలిపిస్తున్నాం. ప్రజాస్వామ్యం పేరుతో లుచ్చా పనులన్నీ వాళ్ళు చేయిస్తూంటే హ్యాపీగా చూస్తున్నాం. వాళ్ళు గల్లీకొక వైన్‌షాప్, రోడ్డుకొక బెల్ట్‌షాప్, లొకాలిటీకొక బ్రోతల్ హౌస్, దానిపక్కనే గాంబ్లింగ్ హౌస్– ఇవన్నీ వాళ్ళే ప్రారంభోత్సవాలు చేస్తుంటే పోటీలుపడి వెళ్ళి వాళ్ళను పూల దండలతో ముంచెత్తుతున్నాం.

ఆ మర్నాడు రెండోపార్టీ అభ్యర్థి మా కాలనీకొచ్చాడు. అతని కారువెనుక వందకార్లు వచ్చి మా రోడ్లన్నీ బ్లాక్ చేసేశాయ్.

దండలేసే కార్యక్రమం అయ్యాక మీట్ యువర్ ఓటర్ కార్యక్రమం మొదలయింది.

“సార్, మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యాభైవేల కోట్లు అవినీతి జరిగిందని మీడియా అంటోంది” అడిగాడు రంగారెడ్డి.

“నో! యూ ఆర్ రాంగ్! యాభైవేల కోట్లు కాదు, అరవై వేల కోట్లు ఫ్రాడ్ చేశాం!”

అందరూ ఆనందంతో తప్పట్లు కొట్టి ఈలలు వేశారు.

“నేన్జెప్పలే? ఈళ్ళు కనీసం డెబ్బైకోట్లు ఆమ్‌దానీలేన్దే ఫ్రాడ్ చేయర్రా భయ్! బాగా డిగ్నిఫైడ్ పార్టీ” అన్నాడు యాదగిరి.

“మరి మీరు అవినీతితో గిన్నిస్ రికార్డ్ బ్రేక్ చేయలేదా?”

“చేశాంగానీ మా రికార్డ్‌ని మేమే బ్రేక్ చేశాం గనుక ఆ ఉత్సవాలు చేయలేకపోయాం!

ఏదేమయినా ఈసారి అధికారంలోకొస్తే లక్షకోట్ల అవినీతిని టార్గెట్‌గా పెట్టుకున్నాం"

అందరూ చాలాసేపు తప్పట్లుకొట్టి హర్షధ్వానాలు చేశారు.

"ఎలా తయారయారు జనం! లక్షకోట్ల అవినీతిని టార్గెట్‌గా పెట్టుకున్నామని వాడు చెప్తుంటే వీళ్ళు తప్పట్లు కొడుతున్నారు" అంటూ గొణుక్కుంటున్నాడు చంద్రకాంత్.

సావిత్రమ్మ లేచి నిలబడింది.

"గెలిచాక మీరు ప్రజలకోసం ఏం చేయబోతున్నారు?"

"చెప్పాను కదమ్మా! లక్షకోట్ల అవినీతి మా ప్రభుత్వం టార్గెట్ అని"

"అవినీతివల్ల మీకు లాభం గానీ మా ప్రజలకేంటి లాభం?"

"ఆమాత్రం మీలాంటి ఎడ్యుకేటెడ్‌కి తెలీలేదంటే నాకు చాలా షాకింగ్‌గా ఉంది. అవినీతి అనేది ఎలా పుడుతుంది? ఏదయినా ఒక పని చేస్తేనే కదా అవినీతి పుట్టేది? మేము లక్షకోట్ల అవినీతిని టార్గెట్‌గా పెట్టుకున్నామంటే కనీసం కోటి కోట్ల అభివృద్ధయినా జరుగుతుంది కదా! ఆ అభివృద్ధి వల్ల లాభం ప్రజలకే కదా!"

అందరూ మళ్ళీ తప్పట్లు కొట్టారు.

"సార్, ఈసారి ఓటుకి ఎంత డబ్బివ్వబోతున్నారు?"

"ఎడ్యుకేటెడ్ ఓటర్లయితే ఓటుకి రెండువేల రూపాయల వరకూ ఖర్చుపెట్టాలనుకుంటున్నాం! అదే కూలీనాలీ జనం ఓటుకి అయిదువందల కంటె ఎక్కువ ఇవ్వదల్చుకోలేదు"

"అదేంటి? చదువుకున్నోడి ఓటుకి అంత ఎక్కువ ఎందుకు ఇవ్వాలనుకుంటున్నారు?"

"ఎందుకంటే చదువుకున్నోడు అందరి దగ్గరా డబ్బు తీసుకుని తనకు నచ్చిన పార్టీకి వేసే అవకాశం ఉంది! అందుకే వాడికి రెండువేలిచ్చి, ఎలక్షన్ రోజున ఉదయం వాడింటికెళ్ళి వాడి వేళ్ళన్నిటికీ ఇంక్ గుర్తులు పెట్టేస్తాం! దానివల్ల వాడి ఓటు మాకు పడదుగానీ వేరే ఎవడికీ పడకుండా ఆపుతామన్నమాట!"

అందరూ మళ్ళీ తప్పట్లు కొట్టారు.

"సార్ మీరు గెలుస్తే కిలో బియ్యం ఎంతకిస్తారు?"

"మేం గెలిచిన మొదటిరోజు నుంచే కిలో బియ్యం వందరూపాయలు చేస్తాం"

అందరూ షాకయిపోయాం.

"అదేంటి సార్! అందరూ కిలో బియ్యం రూపాయికీ లేదా అసలు ఉచితంగా ఇస్తామంటూంటే మీరు వందరూపాయలు అంటారేంటి?"

"మీ కాలనీ ఓటర్లు మరీ బ్యాక్‌వర్డ్ పీపుల్ లాగున్నారు. వందరూపాయలకు కిలోబియ్యం ఎప్పుడు చేయగలం? ప్రజలందరూ కూడా అవినీతిపరులయి, లక్షలు లక్షలు

సంపాదించే అవకాశాన్ని మా ప్రభుత్వం కల్పిస్తుంది. మరి ప్రజల దగ్గర అంత అవినీతి సొమ్ము ఉన్నప్పుడు వంద రూపాయలు కిలో బియ్యానికి ఖర్చు చేయడానికేమయింది? ప్రపంచంలోకెల్లా అతి పెద్ద పర్చేజింగ్ పవర్ ఉన్నదేశంగా మనది అభివృద్ధి చెందుతుంది గనుక మన ఎకానమీ కూడా బ్రహ్మాండంగా ఉంటుంది"

"కానీ ప్రజలందరికీ అవినీతి సంపాదన ఎలా వస్తుంది సార్?"

"ప్రభుత్వం లక్షకోట్ల అవినీతిని టార్గెట్‌గా పెట్టుకున్నప్పుడు పర్ కాపిటా ఫ్రాడ్ కూడా ఆటోమేటిగ్గా పెరిగిపోతుందని మా పార్టీ ఆర్థిక నిపుణులు అంటున్నారు– ఎక్స్‌పెరిమెంట్ చేసి చూద్దాం! మనకు నష్టం లేదుగా. అయితే వరల్డ్‌లో నెంబర్‌వన్ అవుతాం– అంతేకదా?" అందరూ మళ్ళీ తప్పట్లుకొట్టారు.

ఇలా నాలుగు రోజులు గడిచాక నలుగురు అభ్యర్థులు దగ్గర్నుంచీ మా కాలనీ వాళ్ళు యాభై లక్షలు తీసుకుని రెండువేల ఓట్లు అమ్మడానికి నిశ్చయించుకున్నారు.

ఓట్లు అమ్ముకున్న డబ్బుతో ఆ రాత్రి మా కమిటీ మెంబర్స్ అందరం ముందు పార్టీ చేసుకున్నాం.

బాగా మందెక్కువయి పోయేసరికి రంగారెడ్డికి ఏడుపు మొదలెట్టాడు.

"ఒరేయ్ గోపాల్రావ్! మా ఓట్లకు మంచి రేటే ఇప్పించావ్‌గానీ, ఇంకొంత కాలం మనం ఈ ప్రజాస్వామ్యాన్నే నమ్ముకుంటే మన ప్రజలందరూ తాగుబోతులు, వ్యభిచారులు, అవినీతిపరులు, దొంగలు, మర్డరర్లు, కిడ్నాపర్లుగా తయారయిపోవటం ఖాయం రా!"

అతను ఏడుస్తూ మాట్లాడుతుంటే మేమందరం ఆ స్పీచ్‌ని ఎంజాయ్ చేయటం మొదలుపెట్టాం.

* * * * *